# బాబోయ్ బొంబాయి!

బొంబాయి కాపురం చెయ్యాలన్న కూతురి సరదా, పట్టుదల కాదనలేక, వెతికి వెతికి బొంబాయి బ్యాంక్‌లో పని చేస్తున్న ఓ చిన్న ఆఫీసరుని అల్లుడిగా తీసుకువచ్చాడు రామనాథం.

బొంబాయి కాపురానికి వెళ్లింది సంధ్య.

బేంక్ కాలనీలో క్వార్టర్స్. తక్కిన క్వార్టర్స్‌లో ఇద్దరో ముగ్గురో తెలుగు వాళ్ళు. తక్కిన వాళ్ళు తెలుగువాళ్ళు కాకపోయినా తన ఈడువాళ్ళు. అంతా బాగానే ఉందికాని, తను అనుకున్నట్టుగా రోజా షైర్లూ, షికార్లూ, తాజ్ కాంటినెంటల్‌లో డిన్నర్లూ, గేట్ వేఆఫ్ ఇండియాకి వ్యాహ్యాళులూ, పేవ్‌మెంట్లమీద భర్తా తనూ చెయ్యీ చెయ్యీ పుచ్చుకుని నడవడాలూ, ఇవేవీ కుదరడం లేదు.

పొద్దుట ఎనిమిదింటికి వెళ్ళిన సర్వేశ్వర్రావు రాత్రి ఏడయితేగాని ఇంటికి చేరుకోడు. ఓ లోకల్ ట్రెను, రెండు సిటీ బస్సులూ మారి నీరసంగా గడపలో కాలుపెడుతూన్న భర్తని షైరు వెళదాం అని ఏం అడుగుతుంది. పోనీ ఆదివారం ఎక్కడికైనా ప్రోగ్రాం వేసుకుందాం అంటే, ఆరోజున లక్ష పనులు- మామూలు రోజుకంటే ఆరోజు మరీ బిజీగా ఉంటుంది, సరుకులు తెచ్చుకోవడం, వగైరా కార్యక్రమాలతో-

బొంబాయిలో తన సరదాలు తీరడం మాట అలా ఉంచి, తోచి చావడం లేదు మామూలు రోజుల్లో. ఆ మాటే అంది సంధ్య ఓ రోజున సర్వేశ్వర్రావుతో.

అతను నవ్వి, "ఇక్కడ లైఫ్ ఇలా యాంత్రికంగానే ఉంటుంది. సరే నేను సాయంత్రం వచ్చేటప్పటికి రెడీగా ఉండు. ఓ ఫ్రెండ్ ఇంటికి వెళదాం. వస్తున్నాం అని అతనికి బ్యాంకు నుంచి ఫోన్ చేసి చెప్తాను" అన్నాడు.

సాయంత్రం సర్వేశ్వర్రావు ఇంకా రాలేదు. ఏం చీర కట్టుకోవాలో తేల్చుకోలేక సతమతమౌతున్న సమయంలో ఎవరో తలుపు తట్టారు. తీరా చూస్తే పక్కఫ్లాట్‌లో ఉండే షమ్మీర్!

పిల్లనెత్తుకుని బిక్కమొహంతో నుంచున్న షమ్మీర్‌ని చూసి, వచ్చీ రాని హిందీలో "ఏమైంది" అని అడిగింది సంధ్య.

బ్రెడ్ వాడు వస్తే, అయిదేళ్ళ పాపని ఎత్తుకుని ఇవతలకి వచ్చిందట. వచ్చేటప్పుడు

తలుపులు పడిపోకుండా చిడత పెట్టటం మరచిపోయిందట. అంతే గాలికి తలుపులు ధనామంటూ మూసుకుని, లోపల గడియ పడిపోయిందట. తను ఇవతల ఉంది. తాళం చెవి లోపల ఉంది. తాళం చెవి ఉంటే గాని తలుపుని తియ్యడం కుదరదు. షమ్మీర్ కన్నీళ్ళు తరవాయిగా చెప్పింది.

ఆటోమేటిక్ లాక్స్‌తో ఉండే చిక్కు ఇదే!

లోపల ఉన్నప్పుడు తలుపులు పడిపోయినా, లేకపోతే కావాలని వేసేసినా ఫరవాలేదు. గడియ పడినవైపు ఉంటారు కనుక, తాళం అవసరం లేకుండా గడియని చేత్తో తీసినా తాళం చెవి జేబులో వేసుకుని తలుపుని దగ్గరగా లాగితే చాలు లోపల గడియ పడిపోతుంది. దగ్గర తాళం చెవి ఉంది కనుక దాంతో తలుపు తెరవ్వచ్చు. ఇవతల నుంచుని తాళంచెవి తిప్పితే లోపల గడియ వస్తుంది. చిక్కల్లా, దగ్గర తాళంచెవి పెట్టుకోకుండా బయటకి వెళ్ళేటప్పుడు తలుపులు దగ్గరకి లాగేసినా లేదా ఇలా షమ్మీర్ లాగ ఆదమరచి బయటవుండగా ఏ గాలి విసురుకో తలుపు పడిపోయినా ఇంకా తలుపు బందే! తలుపులు బద్దలుకొట్టాల్సిందే. ఆ బిల్డింగ్‌లోనే అన్నమాటేంటి, బొంబాయిలో చాలా ఇళ్ళకి ఉండేవి ఇలాంటి ఆటోమేటిక్ లాక్సే. వీటితో ఇంకో చిక్కు, ఏ తాళంచెవితోటి ఆ తలుపు రావలసిందో దానితోనేతప్ప ఇంకొకళ్ళింటి తాళంచెవితోటి వచ్చినా రాదు.

ఇదంతా తనకి కాపురానికి వచ్చిన రోజున పెద్దపాఠం చెప్పినట్టు సోదాహరణంగా ప్రయోగం చేసి చూపించి మరీ చెప్పాడు సర్వేశ్వర్రావు.

అస్లామాటకొస్తే బొంబాయి క్రొత్తగా కాపరానికి వచ్చిన ప్రతీ అమ్మాయికీ భర్త చెప్పేదీ చెప్పవలసినదీ మొట్టమొదటి పాఠమిదే. ఆ పాఠం జ్ఞాపకం ఉంచుకోకపోవడం వల్ల షమ్మీర్‌కి వచ్చిన ఇబ్బంది ఏదో అర్థం చేసుకుంది సంధ్య.

"అయితే ఓ తాళంచెవి లోపల ఉండిపోయింది. మరో డూప్లికేట్ తాళంచెవి మీ వారు పట్టికెళ్ళారు.ఆయన వచ్చేదాకా తలుపు తెరవడానికి లేదు. అంతేనా. సరే. మీ వారు వచ్చేదాకా వరండాలో ఏం నిలబడి ఉంటారు. ఇలా వచ్చి కూర్చోండి. " అంటూ కుర్చీ చూపించింది సంధ్య. షమ్మీర్ పాపతో వచ్చి కూర్చుంది. కాసేపయ్యాక పాప, నోట్లోవేలేసుకుని, చప్పరిస్తూ "బొమ్మకావాలి!" అంటూ అలమారుకేసి చూపించింది. షమ్మీర్ వెంటనే బొమ్మతీసి కూతురికి ఇచ్చింది. తన ఇంట్లో బొమ్మ, ''నని అడక్కుండా

అంత చొరవగా కూతురికి ఇస్తుందేంటి అని ఆశ్చర్యంగా సంధ్య షమ్మీర్‌కేసి చూసింది. అటు ఆడీ ఇటు ఆడీ బొమ్మ విరగ్గొట్టి పైపెచ్చు "ఆకలే!" అంటూ శోకాలు మొదలెట్టింది పాప.

"ఆయన ఎప్పుడొస్తారో- కాస్త పాపకన్నం పెట్టండి" అంది షమ్మీర్.

"ఈ పూట మేము ఫ్రెండ్స్ ఇంటికి భోజనానికి వెడుతున్నాం. అన్నం వండలేదు అని అనొచ్చు. కానీ ఏం బాగుంటుంది. దేవుడా అని ఓ చిన్న గిన్నెలో బియ్యంపోసి స్టవ్ వెలిగించింది సంధ్య.

ఇంతలో సర్వేశ్వర్రావు వచ్చాడు. వస్తూనే "ఏమిటి. ఇంకా రెడీ కాలేదా." అని కోపంగా అనబోయి వెంటనే పరిస్థితి అర్థం చేసుకుని ఊరుకున్నాడు. పాప అన్నం తినడం అయ్యింది. తనూ సర్వేశ్వర్రావు బయటకి వెళ్ళడానికి బట్టలు వేసుకున్నారు. షమ్మీర్ లేచి "వెళ్ళొస్తాను" అంటుందేమో అని చూసింది సంధ్య. ఆమెలో అటువంటి ప్రయత్నం ఏమీ కనిపించకపోగా, "మావారు ఎప్పుడొస్తారో ఏమో. నాకు నిద్ర వస్తోంది. ఆయన వస్తే లేపండి" అంటూ మంచం మీద ఉన్న దిండూ దుప్పటీ సర్దబోయింది. సంధ్యకి చిరాకుతో ప్రాణం విసిగి "ఇదిగో చూడండి. మీవారు వచ్చేదాకా మా ఇంట్లో ఉంటే ఉండండి.కానీ మేం మాత్రం అలా ఫ్రెండ్స్ ఇంటికి వెళ్ళాలి. ఇప్పటికే ఆలస్యం అయ్యింది. కనిపెట్టుకుని ఉంటారు. రండి వెళదాం" అంటూ భర్తని హెచ్చరించి అతనితో కలిసి వెళ్ళిపోయింది సంధ్య.

రాత్రి పొద్దుపోయాక తిరిగి వచ్చేసరికి ఆటబొమ్మలన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. కూతురుకోసం అలమార్లోని అన్నీ తీసి ఇచ్చి ఉంటుంది షమ్మీర్. సంధ్యకి విసుగూ అసహ్యం వేశాయి. ఆ విసుగును దాచుకోలేక భర్తతో అంది. "తలుపు పడిపోతే తాళం రాదని తెలుసు కదా- జాగ్రత్తగా ఉండొద్దూ. ఎంత తెలివి తక్కువ మొద్దో చూడండి షమ్మీర్!" అంది.

సర్వేశ్వర్రావు నవ్వి "ఈ ఇబ్బంది ఎవరికైనే వచ్చేదే. అప్పుడే నెగ్గావు. అనుకోకూడదు" అన్నాడు.

"జాగ్రత్తగా ఉంటే ఎందుకొస్తుంది" అంటూ కొండంత ఆత్మ విశ్వాసంతో భర్తకేసి చూసి చిరునవ్వు నవ్వి లైటు ఆర్పింది సంధ్య.

వీలైనంతవరకూ సంధ్య ఎప్పుడూ ఏమరిపాటు పడలేదు.ఏడాదయింది. ఇంట్లో ఓ పాప బయలుదేరింది.సర్వేశ్వర్రావుకి ప్రమోషన్ కూడా వచ్చింది.

"మనందరిలాగ కాదు.సంధ్యకెలాగైనా జాగ్రత్త ఎక్కువ "అంటూ చుట్టుప్రక్కలవాళ్లు సర్టిఫికెట్‌కూడా ఇచ్చారు.

ఓ రోజు చీకటి పడింది. బ్యాంక్ ఫ్రెండ్స్ ఎవరో వచ్చారు.ఎనిమిది అయింది. అని వాళ్లు లేచి వెడుతూ ఉంటే సాగనంపడానికి సర్వేశ్వర్రావు ఇవతలికి వచ్చాడు.కబుర్లు చెబుతూ కొత్తచీర అంచులు సవరించుకుంటూ తనూ ఇవతలికి వచ్చింది.లోపల పాప నిద్రపోతోంది.

ఇంతలో ధనామంటూ తలుపు పడిపోయింది.

సంధ్య ఒక్కమారు నివ్వెరపడి ఉండిపోయి వెంటనే"అయ్యో!పాప లోపల ఉండిపోయింది" అంటూ లబోదిబోమంది.

వెళ్లబోతున్న బ్యాంక్ ఫ్రెండ్స్ ఆగిపోయారు.

చుట్టుపక్కల ఫ్లాట్స్‌వాళ్లంతా పోగయ్యారు.లోపల పాపగుక్కపట్టి ఏడుస్తోంది.తలుపు తీయడం ఎలాగ?తాళంచెవులు రెండూ లోపలే ఉండిపోయాయి.ఆలస్యం అయితే లోపలవున్న పాప ఏడ్చి ఊడ్చి సొమ్మసిల్లిపోతుంది.ఎలాగ?ఏంచెయ్యాలి? అందరూ తలలు పట్టుకుని కూర్చున్నారు.ఎవరికీ ఏం తోచడం లేదు.

ఒకాయనకి చప్పున ఆలోచనతట్టి ఫైర్ ఆఫీసుకి ఫోన్ చేసాడు.వాళ్లు వెంటనే వేన్‌లో వచ్చారుకాని తలుపులు బద్దలు కొట్టాలంటే పోలీసువాళ్ల క్లియరెన్స్ కావాలన్నారు.దాంతో రాత్రికి రాత్రి పోలీస్‌స్టేషనుకి ఫోన్ చేయాల్సొచ్చింది.పోలీసులు వచ్చి సాక్ష్యాలు ,సంతకాలు, హామీలు అన్నీఅయ్యాక ఫైర్ ఆఫీసువాళ్లు పనిప్రారంభించారు. నిశిరాత్రివేళ ధనాధన్‌మంటూ స్టంట్ పిక్చర్‌లోలాగ భయంకరమైన శబ్దాలు.

"ఏమైంది ఏమైంది" అంటూ కాలనీలో వాళ్లంతా కంగారుకంగారుగా రావడం, వచ్చినవాళ్లంతా హెచ్చరికలు, కేకలు, అరుపులు-లోపల్నుంచి చంటిపిల్ల గగ్గోలు పెట్టి ఏడవడం-"పిల్లప్రాణం కడంటిపోతుంది బాబోయ్" అని సంధ్య ఏడుపు, సర్వేశ్వర్రావు కేకలు-అంతా అలగోడూ-పాలగోడూ గంటన్నర రణగొణధ్వని అయ్యాక, ధబాలుమని తలుపులు విరిగిపడ్డాయి.ఒక్క ఉదుటున సంధ్య లోపలికి పరిగెత్తి చంటిదాన్ని గుండెలకి హత్తుకుంది.

మరునాడు ఫ్లాట్స్‌లోని ఆడవాళ్లందరినీ సమావేశపరచి ఓ చక్కనిసూచన చేసింది సంధ్య.అంతే ఆ సూచనని నిమిషాల్లో అమలుపరిచేసారంతా అతి సంతోషంగా.

ఇప్పుడెవరైనా "ఎలావుంది బొంబాయిజీవితం"అంటే "బాబోయ్" అంటూ గుండెలమీద చేయి వేసుకుంటుంది సంధ్య.

"నీ మోజుతీరిందా?" వెక్కిరింతగా అడుగుతున్నట్లు తగుల్తుందో తాళంచెవి.

❄❄❄

(జ్యోతి మాసపత్రిక 1985)